# చింతాదేవి

శ్రీ కాకుళం శకుంతలాదేవి

యమునానదీతీరమున కౌలపి యను చిన్న నగరముండెను. చింతాదేవి ఆనగరనివాసియగు ఒక బొందిలీ యోధునికుమార్తె. ఆమెతల్లి బాల్యావస్థయందే చనిపోయెను. చింతాదేవి పోషణభారమంతయు తండ్రిపై బడెను. అవి యుద్ధపురోజులు. యోధులకునడికట్టు విప్పుటకుకూడ తీరికలేదు, వారు గుఱ్ఱములమీదనే భోజనము చేయుచుండిరి. జీనుమీదనే కునికిపాట్లు పడుచుండిరి. చింతాదేవి బాల్యావస్థయంతయు రణభూమిలోనే గడచెను. తండ్రి యామెనేదైన గుహాయందుకాని చెట్టుచాటునకాని దాచిపెట్టి యుద్ధభూమికి వెళ్లుచుండెను. చింతాదేవి ఒక్కతే నిర్భయముగా కూర్చుండెడిది, మట్టితో బొమ్మరిండ్లు కట్టుకొని పాడు చేయుచుండెడిది. సిపాయిల బొమ్మలుచేసి రణక్షేత్రమున నిలువబెట్టు చుండెడిది. ఎప్పుడైన నామెతండ్రి సాయంత్రమునకు తిరిగి రాకపోయినప్పటికి చింతాదేవి నిర్భయముగ నుండెడిది. నిర్జనస్థానమున ఆకలి దప్పికలుమరచి రాత్రియంతయు కూర్చుండేది. ఆమె చిన్నప్పుడు కాకిపిట్టల కథలను వినలేదు. వీరులయొక్క ఆత్మార్పణకథలను వీరుల నోటిమీదుగనే విన్నది.

ఒకసారి మూడుదినములవరకు చింతాదేవికి తన తండ్రికబురు తెలియలేదు. ఆమె యొక కొండమీద కూర్చుండి లోలోపల శత్రువులు తనకోటలోని సంగతులేమాత్రము యెరుగకుండ జేయుటకు ఆలోచించుచుండెడిది. రోజంతయు ఆమె యిటువంటి కోటవిషయములను ఆలోచించి రాత్రి స్వప్నమున కనుచుండెను. మూడవదినము సాయంసమయమున తన తండ్రి యనుచరులువచ్చి ఆమెయెదుట యేడువ ప్రారంభించిరి. చింతాదేవి ఆశ్చర్యపడి "తండ్రిగారెక్కడ? మీరెందు కేడ్చుచున్నారని" అడిగెను.

ఎవరును జవాబు చెప్పలేదు. వారు గుండెలు కొట్టుకొని యేడువసాగిరి. చింతాదేవి తనతండ్రి వీరస్వర్గమునకు వెళ్లినాడని తెలుసుకొనెను. ఆ పదమూడేండ్లబాలికకు కంటనీరు క్రమ్మలేదు. ముఖముకందలేదు. అయ్యోయని కూడ అనలేదు. 'వారు వీరస్వర్గమునకు వెళ్లినారు కాబట్టి మీరెందు కేడ్చెదరు? యోధులకు దీనికన్న మించిన మృత్యువు లభించునా? ఇది దిగులుపడు సమయము కాదు ఆనందసమయము' అనెను.

ఒక సిపాయి దీనస్వరముతో "ఇప్పుడు నీదిగులేమాకున్నది. ఇక నీవెచ్చటుండెద" వని అడిగెను. చింతాదేవి గంభీరస్వరముతో "మీరు దీనికై విచారపడవద్దు. నేను నాతండ్రికి తగినకుమార్తెను. వారుచేసినదే నేనును చేసెదను, ఆయన తనదేశమునకు చేసిన సేవ నాకాదర్శము. మీరువెళ్లి మీమీపనులను చూచుకొనుడు. నాకొక గుఱ్ఱమును, ఆయుధములను ఏర్పాటుచేయుడు, నేనెప్పుడును మీకన్న వెనుకబడనని తలంచుడు. కాని ఎన్నడైన నేనుకాడిన వెంటనే నాతల నెగురవేయుడు. ఇదే నేను మిమ్ముల కోరునది. కావున మీరాలస్యముచేయక వెళ్ళుడు" అనెను.

చింతాదేవియొక్క వీరవాక్యములువిని సిపాయిలేమాత్రము ఆశ్చర్యపడలేదు, కాని "యీ సుకుమారియగు బాలిక తనమాటమీద నిలువగలదా" యను సందేహముమాత్రము వారికి తప్పక కలిగెను.

౨

అయిదేండ్లు గడచెను. అన్ని ప్రాంతములందును చింతాదేవికీర్తి వ్యాపించెను. ఆమె బాణములకు తుపాకిగుండ్లకు ఱొమ్మిచ్చి నిర్భయముగా నిలువబడుట చూడగనే సైనికులకు ప్రోత్సాహము కలుగుచుండెను. అట్టి ఆమెయెదుట యెవరు వెనుక అంజవేయగలరు? కుసుమకోమలియగు యువతీమణి ముందుకు వెళ్లుచున్నప్పుడు ఏపురుషుడు వెన్నుచూపును? చింతాదేవి కళకాంతులు, రూపురేఖలు, మంచిమంచి మొనగాండ్రనుకూడ నలువైపులనుంచి యేరియేరి లాగుకొనివచ్చి తనసేన నలంకరించుకొనెను. ప్రాణములకు తెగించిన తుమ్మెదలెన్నియో అన్ని వైపులనుండి వచ్చిపడి ఆపుష్పముచుట్టు పరిభ్రమింపసాగెను.

ఈ యోధులలో రత్నసింహుడను పేరుగల యువకుడుండెను. అర్ధరాత్రి గడచుచుండెను. చింతాదేవి తనడేరాలో పరుండెను, సైనికులుగూడ ఆకలిదప్పికలు తీర్చుకొని మైమరచి పరుండిరి. వారి

ముందరే దట్టమైన అడవియుండెను. దానికావలనే శత్రుదళముకూడ విడిసియుండెను. చింతాదేవి వారిరాక కనిపెట్టి తెల్లవారగనే శత్రువులమీద పడుటకు నిశ్చయించెను. శత్రువులకు తనసంగతి తెలియదని ఆమె నమ్మియుండెను.

కాని సైనికుడొకడు శత్రువులలోకలిసి ఇక్కడి సంగతులను ఏరోజుకారోజు తెలుపుచుండెను. ముగ్గురు సైనికులు క్రూరమృగములమాదిరి అడవినిదాటి వచ్చిరి. వారు చింతాదేవి డేరా యెచ్చటనుండునో యని ఒక చెట్టుచాటున నిలువబడి ఆలోచింపసాగిరి. తరువాత వారక్కడినుండి మొసలివలె ప్రాకుచు డేరావైపునకు వచ్చుచుండిరి. పారావాండ్రుకూడ సొమ్మసిల్లి పరుండిరి. కేవలము ఒకప్రాణిమాత్రమే డేరావెనుక మోకాలిమీద కూర్చొనియుండెను. అతడే సింహుడు. ఘాతకుల యలికిడివిని కత్తిని చర్రున దూసెను. ముగ్గురు మనుష్యులు డేరాలో జొరబడనుండిరి. అప్పుడాతడేమి చేయగలడు? గోలచేసిన సేనయంతయు గందరగోళమగును. అంధకారములో జనులు తెలియక ఒకరినొకరు నరుకుకొనెదరు. విశేషముగా ఆలోచించుటకును సమయములేదు. వెంటనే కత్తితో ఆముగ్గురిమీద పడెను. గడియసేపు కత్తులు సద్దుచేసెను. మరల ప్రశాంతమయ్యెను. వారుముగ్గురు దెబ్బలుతిని క్రింద పడిపోయిరి. ఇక్కడ రత్నసింగుకూడ గాయములచే స్పృహతప్పి పడిపోయెను.

ప్రాతఃకాలమున చింతాదేవి లేచి నలుగురుయువకులు క్రిందపడియుండుటచూచెను. ఆమెగుండె గుభేలుమనెను. దగ్గరకు వెళ్లిచూడగా వారు ముగ్గురును చనిపోయిరి. కాని రత్నసింహుని కూపిరియాడుచుండెను. సంగతియంతయు బోధపడెను. తండ్రిమృత్యువునకు ఒకకణమైన నశ్రువులు కార్చనియామె కన్నులు నేడు కడివెడు కన్నీళ్ళు కార్చెను. చింత రత్నసింహునితల తొడమీద పెట్టుకొని తనహృదయమండప స్వయంవరమున అతని మెడలో పూలదండ వేసెను.

౩

నెలవరకు రత్నసింహుడు కన్నులు తెరువలేదు. చింతాదేవి కన్నులు మూయలేదు. ఆమె అతని దగ్గరనుండి క్షణమైన ఎక్కడకు పోలేదు. శత్రువులమీదకు వెళ్లు స్మరణలేదు. రత్నసింహునికై ఆమె తన ధనసంపదలను వదలెను. నెల గడచిన తదుపరి రత్నసింహుడు కండ్లు తెరిచెను. మంచముమీద తానుండుట చూచెను. చింతాదేవి యెదుట విసరుచుండెను. అతడు హీనస్వరముతో "చింతా, విసనకఱ్ఱ నాకిమ్ము నీకు కష్టమెందుకు" అనెను.

చింతాదేవి హృదయ మీ సమయమున స్వర్గసుఖ మనుభవించు నట్లుండెను. నెలరోజుల నుంచి శుష్కశరీరముతో అతని తలకట్టున కూర్చుండి నిరాశచే యేడ్చుచున్న యా యువతి నేడతడు మాట్లాడుట చూచి యెంతో సంతోషపడెను. ఆమె మధుర స్వరముతో "ప్రాణనాథా! ఇదియే కష్టమైన ఇక సుఖమేమిటి?" అనెను. ప్రాణనాథా యను సంబోధనవిని రత్నసింహు డులికిపడెను. అతని ముఖమున క్రొత్తమార్పులు కలిగెను. "నా వలన మీకు చాల శ్రమ కలిగె"నని చింతాదేవి పలికెను. రత్నసింహుడు లేచుటకు ప్రయత్నించుచు "తపస్సు చేయనిదే సిద్ధియెట్లు లభించును" అనెను.

చింతాదేవి రత్నసింహుని తన కోమల హస్తములతో పరుండబెట్టుచు "ఈసిద్ధికై మీరు తపస్సు చేయలేదు. నాపరిస్థితి యందున్న మరెవ్వతెనైనను మీరు రక్షింపకుందురా? నేను బ్రతికినన్నాళ్లు బ్రహ్మచారిణిగా నుండుటకు ప్రతిజ్ఞ చేసుకొంటిని కాని మీ ప్రాణత్యాగము నా ప్రతిజ్ఞను భంగపరిచెను. నేను యోధుల చేతిలో పెరిగితిని. నా హృదయముగూడ నట్టి పురుషసింహుని చరణములకే అర్పించితిని. ఇక మీదాసినైతిని" అనెను.

ఇదియే మొదటి ప్రణయరాత్రి. నలువైపుల ప్రశాంతముగా నుండెను. కేవలము ఇద్దరి హృదయములలో అభిలాష తాండవ మాడుచుండెను. సర్వత్ర పండువెన్నెల కాయుచుండెను. వధూవరు లిద్దరు ప్రేమాలాపములలో మునిగియుండిరి. "శత్రుసేన కోటవైపు వచ్చుచున్నద"ని అకస్మికముగా కబురువచ్చెను. చింతాదేవి ఉలికిపడెను. రత్నసింహుడు నిలువబడి మేకుకు తగిలించియున్న కత్తిని తీసుకొనెను. చింతాదేవి స్నేహ దృష్టిచే చూచుచు "కొంతమంది మనుష్యులను పంపుడు; మీరు వెళ్లుటకేమి యవసరమ"నెను.

రత్నసింహుడు తుపాకిని భుజముమీద పెట్టుకొనుచు "వారు అసంఖ్యాకులుగా వచ్చుచుండిరేమో యను అనుమానము వేయుచున్నది" అనెను.

చింతా:—అటులైన నేనుగూడ వత్తును.

రత్న:—వద్దు, వద్దు వారు నాయెదుట నిలువలేరు. ఒకవ్రేటునకే అందరిని పరుండబెట్టుదును.

చింతా:—సరే మన ప్రణయరాత్రి విజయరాత్రిగా యీశ్వరు డనుగ్రహించుగాక. నా మనస్సెందునకో చాల దడదడ లాడుచున్నది. పోనిచ్చుటకు సమ్మతించుట లేదు.

ఈ ప్రేమపూరిత వాక్యములకు రత్నసింహుడు విహ్వలుడై చింతాదేవిని ఆలింగనము చేసుకొని "ప్రేయసీ! ప్రొద్దుటికే రాగలను" అనెను.

చింతాదేవి పతి మెడమీద చెయ్యివేసి కండ్లనీరు పెట్టుకొని "మీ రెన్నిదినములకు వచ్చెదరో యని నాకు భయమగుచున్నది. నామనస్సు మీ వెంట నుండును. పోగానే ప్రతిదినము కబురు పంపు చుండుడు. సమయానుకూలముగా మెలగుడు. పోయిరండు" అనెను.

చింతాదేవిగుండె ఉయ్యాల లూగుచుండెను. తొట్టతొదట విజయమును వాంఛించు ఆమె మనస్సు నేడు భోగవిలాసము వాంఛించుచుండెను. ఆడుసింహమువలె గర్జించి శత్రుజనకంఠముల దెగవ్రేయు ఆయువతీమణి హృదయము నేడు దుర్భరమయ్యెను. రత్నసింహుడు గుఱ్ఱమెక్కి వెళ్లు చున్నప్పుడు ఆమె తన మనస్సులో నెందరో దేవతలకు ముడుపులు కట్టుకొనెను.

అతడు కనుపించునంతవరకు ఆమె చూడసాగెను. తదుపరి కోటచివర బురుజుమీది కెక్కి చాలసేపు చూచెను. తరువాత అతడు కనుపించలేదు. ఏడ్చుచు బురుజుమీదనుంచి దిగెను. శయ్యమీద పరుండి ముఖముమీద గుడ్డవైచుకొని వెక్కి వెక్కి యేడువసాగెను.

౪

రత్నసింహుని వెంట చాల స్వల్పముగా నూరు మందే సైనికులుండిరి. వారు వీరోల్లాసము చే జాతీయకీర్తనలు పాడుచు గుఱ్ఱములమీద పోవు చుండిరి. కొండలు ప్రతిధ్వనించుచుండెను. గుఱ్ఱములు టక్కుటక్కున అడుగుల చప్పుడుచే తాళము వేయుచుండెను. ఆరాత్రి గడచినది. సూర్యుడు ఉదయించెను. వారిమీద చల్లని యరుణ కిరణములు సోకుచుండెను. వీరికి శత్రువులు కొండమీద యున్నట్లు కనుపించెను. రత్నసింహుడు తలవంచు కొని వియోగమును నణచుకొనుచు వెనుక వెనుక మెల్లగా వచ్చుచుండెను. అడుగు ముందుకు వేయు చుండెను. కాని మనస్సు వెనుకకు లాగుచుండెను. సాహసియైన సిపాయి నాయకుడొక డాతని సమీపమునకు వచ్చి "సోదరా! శత్రువులడేరా కొండ మీద నున్నది. నీయిష్టమేమి? మాయిష్టము వెంటనే శత్రువులమీద పడవలెనని యున్నది. ఆలస్యమైన వారు గూడ సిద్ధపడెదరు. తలచిన పనియంతయు చెడిపోవును. శత్రుసైన్యము వేయికి తక్కువలేదు" అనెను.

రత్నసింహుడు విచారభరిత నేత్రములతో శత్రువులవైపు చూచి "అవును అక్లైయున్నది."

సిపాయి:—అయితే మేము వెళ్లి వారి పైబడమా?

రత్న:—మీయిష్టము కాని వారిసంఖ్య అధికముగా నున్నది కాన ఆలోచింపుడు.

సిపాయి:—పరవాలేదు దీనికన్న పెద్దసేనను కూడ యెన్నోసారులు ఓడించియుంటిమి.

రత్న:—ఆదినిజమే! కాని నిప్పులో దుముకుట సరియైనది కాదు.

సిపాయి:—సోదరా! ఏమిమాటలివి? సైనికులన్న నిప్పులో గుముకువారేకదా? కావున నీయాజ్ఞయే ఆలస్యమగుచున్నది.

రత్న:—ఇప్పుడు మనము చాల అలసియున్నాము కాన కొంచెము తాళుడు.

సిపాయి:—సోదరా? వద్దు వారందరకు మన యలికిడి తెలిసినచో చాల ప్రమాదము కలుగును.

రత్న:—అయితే పదండి.

ఒక క్షణములో యోధులు కళ్లెములను సడలించిరి. కాని కొండమీద చేరగానే శత్రువులు అజాగ్రత్తగా లేరని వీరికి తెలిసెను. వారు వీరిమీద పడుటకు సిద్ధముగా నుండిరి. రత్నసింహుని చూచుకొని ఆతనిసైనికులు భయపడలేదు. ఆతడంతకన్న క్లిష్టపరిస్థితియందు గూడ విజయము పొందుచుండెడి వాడు. కాని నేడెందుకోగాని తన పౌరుషము వెలి పుచ్చుటలేదు. అందరి కన్నులు రత్నసింహుని వెతుక సాగినవి. కాని అతనిజాడ యెక్కడనులేదు.

అతడెక్కడకును వెళ్ళడు. తన సాటివాండ్రను ప్రమాదస్థితిలో వదలి తప్పించు నీచుడుకాడు. తప్పక ఇక్కడనెక్కడనో యుండవచ్చునని వారను కొనుచుండిరి. వీరిటు లాలోచించుచుండగనే క్షణములో శత్రువులు వీరిమీద తలపడిరి. ఇంతటి మహా

సేన యెదుట స్వల్పసైనికు లెందు కక్కరకువత్తురు? నలువైపులనుండి సైనికులు "సోదరా? ఎక్కడున్నావు. మాకేమియాజ్ఞ నిచ్చెదవు. శత్రువులు గొంతుమీదకు వచ్చి పడిరి. నీవింకను మౌనము వహించియుంటివా? ఎదుటకు వచ్చి మాకుమార్గము చూపుము. మా కుత్సాహము పెంపుచేయుము" అని యనసాగిరి. కాని రత్నసింహుడు కనుపించలేదు.

ఇంతలో శత్రువులు వారిమీద పడనేపడిరి. రెండుసేనలు కత్తులు దూసెను. బొందిలీలు తమ ప్రాణములను అరచేతిలో పెట్టుకొని యుద్ధము చేయసాగిరి. వారికి నిరాశకూడా యెక్కువ కలిగెను. కాని యుద్ధసమయమున వెనుకంజ యెట్లు వేయగలరు? చెదరిపోయిన వారిని కూరికొల్పు నాథుడు లేడు. కాని వారందరు ప్రాణములు ధారపోసి పేరుపొందిరి. కాని జయమును పొందలేదు. మరాఠీలు తమ గుండెలలో మెదలుచున్న రత్నసింహునిపై కన్నువేసి యుండుటచే ప్రతి శవమును వేయికండ్లతో వెదకిరి. కొండంతయు గాలించిరి. కాని జాడలేదు. బొందిలీలను జయించిరికాని ఆసంపూర్తిగానే.

౫

చింతాదేవి హృదయము నేడెందుకోగాని మాటిమాటికి శంకించుచున్నది. ఆమె యెప్పుడును యింతటి దౌర్బల్యము చూపలేదు. సూర్యుడస్తమించెను. సైనికుడొకడు దిసకాళ్ళతో, బోడినెత్తితో చేతులు నలుపుకొనుచు, ఆమె యెదుటకు వచ్చి నిలువబడెను. చింతాదేవి తలమీద పిడుగు పడినట్లయ్యెను. క్షణకాల మూరకుండెను. మరల లేచి ఆతురతతో సైనికుని దగ్గరకు వచ్చి గద్గదస్వరముతో "ఎవరెవరు మిగిలిరి" అని యడిగెను.

సైని:—ఎవ్వరూ మిగులలేదు.

చింతా:—ఎవ్వరూ మిగులలేదా?

అని తలపట్టుకొని భూమిమీద పడిపోయెను.

సైనికుడు మరల "మరాఠీలు దగ్గరకు వచ్చుచుండిర"నెను.

"దగ్గరకు వచ్చుచుండిరా? అటులైన చితిని సిద్ధముచేయుము వేళలేదు"

సైని:—ఇప్పుడు మనసైనికులు తమకంఠముల నిచ్చుటకు గూడ సిద్ధపడుదురు.

చింతా:—మీయిష్టము వచ్చినట్లు చేసికొనుడు. నా విధి యింతవరకే.

సైని:—మనము కోటమూసివేసి నెలదాక యుద్ధము చేయగలము.

చింతా:—అయితే వెళ్లి యుద్ధముచేయుడు నాకేమియు అక్కరలేదు. ఒకవైపు అంధకారము వెలుతురును నుదుమాడుచు వచ్చుచుండెను. రెండవవైపు జయించిన మరాఠీలు యుద్ధము చేయుటకు వచ్చుచుండిరి. ఇక్కడ కోటలో చితి సిద్ధమగుచుండెను. దీపాలు పెట్టువేళకు చితిలోనిప్పంటుకొనెను.

౬

సాధ్వీమణియగు చింత యేడువారముల సొమ్ములు పెట్టుకొనెను. ఆమె సౌందర్యము చూపరుల కమితాశ్చర్యము గొలుపుచుండెను. ప్రసన్నమైన ఆమహాతల్లి అగ్ని దుముకబోవుచుండెను.

చితికి నలువైపులు స్త్రీ, పురుషులు గుమిగూడిరి. శత్రువులు కోటలో జొరబడిరి. ఈసంగతి యెవరికిని నచ్చలేదు. శోకసంతాపమువలన అందరి ముఖములు మలినముగా నుండెను. వివాహమునకై నిన్న మండపమమర్చినచోటనే నేడు చితిరాజుచున్నది.

ఆకస్మికముగా గుఱ్ఱము గిట్టల చప్పుడు వినవచ్చెను. ఎవరో సిపాయి వచ్చుచుండెనని అందరనుకొనిరి. ఇంతలో ఆ ధ్వనికూడా ఆగిపోయెను. సైనికుడొకడు పరుగెత్తుకొని వాకిలివద్దకు వచ్చి చేరెను. జనులు చకితులై చూచిరి. అతడే రత్నసింహుడు!

రత్నసింహుడు రొప్పుచు చితిదగ్గరకు వచ్చి "ప్రాణేశ్వరీ! నేను బ్రతికియుండగనే నీవిట్లు చేయుచుంటివేల?" అనెను.

చితిలో నిప్పు మండుచుండెను. చింతాదేవి చీరలోనుండి అగ్నిజ్వాలలు బయలుదేరుచుండెను. రత్నసింహు డున్మత్తుడై చితిలో జొరబడి చింతాదేవి చెయ్యిపట్టుకొని లేవదీయసాగెను. జనులు నలువైపులనుండి వచ్చి కట్టెలను తొలగించ ప్రారంభించిరి. కాని చింతాదేవి పతివైపు కన్నెత్తియైన చూడలేదు.

రత్నసింహుడు గుండెలు బాదుకొని యరచుచు "అయ్యో! ప్రాణప్రియా! ఇదేమిటి నావైపు

చూడనేల? నేను బ్రతికియుంటి” ననెను. “నీపేరు రత్నసింహుడు కాని నీవు నా రత్నసింహుడవు కావని” చితిలోనుండి ధ్వని వినవచ్చెను. “నీవిటు కొంచెము కన్నెత్తి చూడుము, నేనే నీ సేవకుడను, నీయుపాసకుడను, నీపతిని.”

“నాపతిరీతి గతిపొందెను”.

“అయ్యో నేనేమిచేయుదును. నేను రత్నసింహుడను ప్రేయసీ! నీవునన్ను గుర్తించుటలేదా!” మంటలు చింతాదేవి ముఖమువరకు వచ్చెను. అప్పు డామె విస్పష్టస్వరముతో “బాగుగా గుర్తించితిని. కాని నీవు నా రత్నసింహుడవు కావు. నా రత్నసింహుడు నిజమైన శూరుడు. ఆతడాత్మ రక్షణకై యీ తుచ్ఛదేహము మీద భ్రాంతిచేత క్షత్రియ ధర్మమును పరిత్యజించు వాడుకాడు. నేను వరించిన పురుషుడు దేవలోకములో దివ్యపీఠమున విరాజిల్లు చున్నాడు. రత్నసింహునకు చెడుపేరు కలిగించకుడు. ఆ మహనీయుడు వీరరాజపుత్రుడు రణక్షేత్రము నుండి పారిపోవు పిరికివాడుకాడు” అనియెను.

చింతాదేవి తలమీదనుండి మంటలు లేచు చుండెను. మరల క్షణములో ఆయనుపమగుణరాసి, ఆయాదర్శ వీరవనిత, ఆ సాధ్వీ తిలకము, అగ్ని జ్వాలలవిలీనమైపోయెను. రత్నసింహుడు నిర్విణ్ణుడై శోకపూరిత దృశ్యము చూచుచు నిలుచబడెను. మరల నిట్టూర్పు విడిచి చివాలున ఆ చితిలో దుమికి యంతర్ధానుడయ్యెను.




“ఏమండీ, యిదేనా పెద్దమనిషితరహా?”

“అయ్యో, యెంత పొరపాటు ! నా జేబు అనుకొని మీజేబులో నికి చెయ్యిని పోనిచ్చానండి”